క్లుప్తంగా

ధర్నాను జయప్రదం చేయండి

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో ఉచితంగా ఇసుక ఇవ్వాలని కోరుతూ ఈ నెల 11న జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లింగన్న పిలుపునిచ్చారు. సోమవారం యర్రగుంట్ల పట్టణంలోని నాల్గు రోడ్ల కూడలి వద్ద ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

బెల్టుషాపుల నిర్వాహకులపై కేసు

ముద్దనూరు : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని బెల్టు షాపులు నిర్వహిస్తున్న నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం మండలంలోని మంగపట్నం, ముద్దనూరు, నల్లబల్లె, సోంపల్లె గ్రామాల్లో బెల్టుషాపులపై దాడి చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. ఈ దాడిలో 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, బెల్టుషాపు నిర్వాహిస్తున్న రాముడు, మునిరెడ్డి, వరప్రసాద్, రామయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పారదర్శకంగా ఇసుక సరఫరా

కొండాపురం : వినియోగదారులకు ఇసుకను పారదర్శకంగా సరఫరా చేయాలని జమ్మలమడుగు ఆర్డీఓ ఆదిములం సాయి శ్రీ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఏటూరు ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ గుర్రప్ప, ఆర్.ఐ మహేశ్వర్ రెడ్డి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

వేంపల్లె : మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో 9 మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు వేంపల్లె ఎస్ఐ రంగారావు తెలిపారు. సోమవారం అందిన సమాచారం మేరకు బెల్టు షాపులపై దాడులు నిర్వహించినట్లు తెలియజేశారు. తాళ్లపల్లె గ్రామంలోని పగిడిపల్లి చికెన్ షాపు ముందర అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా.. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 9మద్యం బాటిళ్లను స్వాధీనం చేస్తున్నట్లు చెప్పారు.

టీటీడీ కాంప్లెక్స్ రూములకు తాళాలు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని పాతబస్టాండ్‌లో గత 45 సంవత్సరాల కిందట టీటీడీ కాంప్లెక్స్ గదులను నిర్మించింది. అయితే కాంప్లెక్స్ రూముల్లో స్లాబ్ దెబ్బతిని అప్పుడో ఇప్పుడో కూలిపోయే స్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో మూడు నెలల కిందట దుకాణ యజమానులకు టీటీడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆ మేరకు సోమవారం తహసీల్దార్ లలిత ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ అధికారుల సహకారంతో ఖాళీ చేయించి రూములను సీజ్ చేశారు.

అవినీతిని నిర్మూలిద్దాం

కమలాపురం : యువత అవినీతి నిర్మూలనకు నడుం బిగించి సమాజాన్ని మార్చాలని నాబార్డ్ ఏజీఎం విజయ విహారి తెలిపారు. సోమవారం స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర కడప శాఖ ఆదేశాల మేరకు స్థానిక మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్ ఆధ్వర్యంలో అవినీతి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రాఘవరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ విజయ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సచివాలయ సిబ్బందితో సమావేశం

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : నైపుణ్య గణన-2024 సర్వే శిక్షణ కార్యక్రమంపై చింతకొమ్మదిన్నె ఎంపీడీఓ కుళాయిబాబు మండల పరిధిలోని సచివాలయాల సిబ్బందితో చింతకొమ్మదిన్నెలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నైపుణ్య గణన సర్వే ముఖ్యాంశాల గురించి వివరించారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

కమలాపురం : వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కామనూరు శ్రీనువాసులురెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకురాలు కే ఉమా మహేశ్వరి నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్లకు వినతి పత్రాలు ఇస్తున్న నేపథ్యంలో కమలాపురం తహసీల్దార్ శివరామిరెడ్డికి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్, రమేష్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రదాత కందుల శివానందరెడ్డి



భోజనం వడ్డిస్తున్న ఐటీఐ ప్రిన్సిపల్, సిబ్బంది

వేంపల్లె : విద్యాప్రదాత దివంగత కందుల శివానందరెడ్డి చిరస్మరణీయుడు అని ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాదరావు కొనియాడారు. సోమవారం వేంపల్లె పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా అనాథ, వృద్ధాశ్రమంలో దివంగత కందుల శివానందరెడ్డి నాల్గవ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు పార్థసారథిరెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు వెంకట సుబ్బయ్య, ఐటీఐ కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కియోస్క్.. సేవలందక మూలకు!



రైతు భరోసా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం

- సాంకేతిక లోపంతో అందని సేవలు
- కార్యాలయాల్లో మూలకు పడేసిన వైనం
- అన్నదాతలకు తిప్పలు

ఎర్రగుంట్ల : నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో అన్ని సచివాలయాల్లో రైతు భరోసా కేంద్రాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి కియోస్క్ యంత్రాలను కొనుగోలు చేసింది. ఎరువులు పురుగు మందులు వ్యవసాయ యంత్రాలు రైతుల పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కెట్ వివరాలు తదితర అసవరమైన అన్ని సేవలను ఈ డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకునే వీలుంది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయ శాఖ అన్ని విధాలా సేవలిందించింది. వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్నా.. సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందు పరిచారు. నాడు రైతులకు ఎంతో మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు, నేడు నిరుపయోగంగా ఉన్నాయి.

నిర్లక్ష్యపు నీడలు

కూటమి ప్రభుత్వం హయాంలో రైతు సేవ కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాల వినియోగంపై నిర్లక్ష్యంపు నీడలు అలుముకున్నాయి. ప్రస్తుతం సాంకేతిక లోపంతో కియోస్క్ యంత్రాలు పని చేయడం లేదు. కొన్ని చోట్ల వీటిని పూర్తి విస్మరించడంతో విలువైన యంత్రాలు మూలన పడ్డాయి. మరి కొన్ని చోట్ల నెట్ సేవలు అందక పనిచేయడం లేదు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం మొక్కు బడిగా రైతు సేవాల కేంద్రాల ద్వారా ఎరువులు అందిస్తున్నారు. రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా పలు చోట్ల కియోస్క్ ఉపయోగంలో ఉన్నాయని, కొన్ని చోట్ల వినియోగించడం లేదని తెలిపారు.

రైతులను ఆదుకోవాలి



సచివాలయ ఉద్యోగికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

జమ్మలమడుగు : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. అధికారంలోనికి వస్తే రైతులకు రైతుబంధు పథకం కింద ఏడాదికి రూ. 20వేల రూపాయల సాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సోమవారం రైతులకు రైతు బంధు పథకం అమలు చేయాలంటూ సచివాయలంలోని అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు ప్రసాద్, రైతు సంఘం నాయకుడు శ్రీనివాసులు, నాగేంద్ర, సుమన్, చేనేత సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

ఎర్రగుంట్ల : రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు తక్షణం రైతు ఖాతాల్లో జమ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు యర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని 3,4,5,6 సచివాలయ సెక్రటరీలకు వినతి పత్రం అందించారు.

కమలాపురం : రబీ సీజన్‌లో రైతులు పంటలు సాగు చేసుకోవడానికి కూటమి ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని సీపీఐ కమలాపురం ఏరియా సహాయ కార్యదర్శి నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పలు సచివాలయాలకు వెళ్లి కార్యదర్శులకు వినతి పత్రం అందజేశారు.

కొండాపురం : రైతులకు పెట్టుబడి సాయం అందించాలని సీపీఐ నాయకులు కోరారు. కొండాపురం గ్రామ సచివాలయంలోని పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రం అందజేశారు. వి. సుదర్శన్ రెడ్డి. పి.వెంకటరమణ, జయంతు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి క్రీడలు ఎంతో అవసరం



క్రీడాకారులకు మెమెంటోను అందిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : ప్రతి విద్యార్థికి క్రీడలు ఎంతో అవసరమని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీలు, ఎంపికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి క్రీడల్లో రాణించడం ద్వారా పేరు ప్రఖ్యాతలతోపాటు తల్లిదండ్రులు, పుట్టిన ఊరికి, చదివిన పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తెస్తాయన్నారు. పోటీలలో విజేతలకు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీడీ కొండారెడ్డి, విద్యాధరి పాఠశాల కరస్పాండెంట్ భానుప్రకాష్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అరుణ కుమారి, జిల్లా సాఫ్ట్ టెన్నిస్ ఆర్గనైజేషన్ సెక్రటరీ ప్రవీణ్ కిరణ్, పీఈటీ ఎం.శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేటను కరువు మండలంగా ప్రకటించండి



తహసీల్దారు విజయకుమారికి వినతిపత్రం అంతజేస్తున్న బీజేపీ నేతలు

చక్రాయపేట : ఎలాంటి సాగునీటి వనరులు లేని చక్రాయపేటను కరువు మండలంగా ప్రకటించాలని బీజేపీ నేతలు సోమవారం నిరసన తెలియజేశారు. బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ కె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి – వేంపల్లె ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 53 మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. ఇందులో చక్రాయపేట లేకపోవడం బాధాకరమన్నారు. ఈ మండలంలో సక్రమంగా వర్షాలు కురవక రైతులు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. పాడి రైతులకు కూడా గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే చక్రాయపేటను కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవడమే కాకుండా అర్ధాంతరంగా ఆగిన కాలేటివాగు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం వారు తహసీల్దారు విజయకుమారి, ఎంపీడీఓ రాజశేఖరరెడ్డిలకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ సీనియర్ నేత లక్ష్మీరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దశరథ, వాణిజ్యవిభాగం అధ్యక్షులు దొంతు సుమన్‌తో పాటు పలువురు పార్టీనేతలు, రైతులు పాల్గొన్నారు. కాగా ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నవారే ఇలా కరువు మండలంగా ప్రకటించాలని నిరసన తెలపడం ఏంటంటూ పలువురు మండలవాసులు చర్చించుకుంటున్నారు.

13 నుంచి జోనల్ క్రీడా పోటీలు



మాట్లాడుతున్న గురుకులాల సమన్వయకర్త బ్రహ్మయ్య

లింగాల : ఈనెల 13, 14, 15వ తేదీలలో గురుకుల పాఠశాల విద్యార్థులకు రాయలసీమ స్థాయి జోనల్ క్రీడా పోటీలు నిర్వహించనున్నామని గురుకుల పాఠశాల సమన్వయకర్త బ్రహ్మయ్య తెలిపారు. సోమవారం ఇప్పట్ల గ్రామ సమీపంలోని బాలయోగి గురుకుల పాఠశాలలో క్రీడా పోటీలపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారమ్స్, బాడ్మింటన్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. అదే విధంగా గండి గురుకుల పాఠశాలలో బాలురకు కబడ్డీ, ఖోఖో, క్యారమ్స్, వాలీబాల్ పోటీలు జరుపుతామన్నారు. కార్యక్రమంలో ఇప్పట్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సత్యవతమ్మ, గండి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సురేంద్ర బాబు, పీఈటీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిర్వాసితుల భూములు కాపాడాలి

ముద్దనూరు : గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు కేటాయించిన భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దారు వరద కిషోర్‌రెడ్డికు చౌటిపల్లె నిర్వాసితులతో కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మంగపట్నం రెవెన్యూ గ్రామ పరిధిలో 2010లో 869 ఎకరాలు కేటాయించారని, నిర్వాసితులకు పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నిర్వాసితులకు న్యాయం చేయకుంటే ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ

సింహాద్రిపురం : నైపుణ్యతను అర్హతగల పౌరులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండల కేంద్రమైన సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సోమవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణనపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుడుతూ మండల వ్యాప్తంగా పౌరులు ఎటువంటి విద్యార్హతలు కలిగి ఉన్నారు, ప్రస్తుత ఉద్యోగ స్థితి, ఇతర స్థితిగతులను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే నైపుణ్యత కలిగిన వారి డేటాను తీసుకుని, భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాల పనులలో వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

కమలాపురం : మండలంలో నైపుణ్య గణన-2024ను పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సచివాలయ సిబ్బందికి శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో తిరిగి 15–59 ఏళ్ల వయస్సు ఉన్న వారికి సర్వే నిర్వహించాలన్నారు. వారు ఏ పని చేస్తున్నారు? ఏ పనిలో నైపుణ్యం ఉందో అదే పని చేస్తున్నారా...లేక పరిస్థితుల ప్రభావం కారణంగా ఇతర పనులు చేస్తున్నారా? తదితర వివరాలను సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కెజియా, జిల్లా కోఆర్డినేటర్ సౌజన్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సభ భవనంలో సోమవారం మండల పరిధిలోని సచివాలయ ఉద్యోగులందరికీ నైపుణ్య గణనపై శిక్షణా తరగుతులు నిర్వహించామని ఎంపీడీఓ వెంకట రమణయ్య తెలిపారు. ఈ సర్వేలో 18 నుంచి 59 ఏళ్ల వయస్సు వారి వివరాలను సేకరించాలన్నారు. సుమారు 25 రకాల ప్రశ్నలకు సమాచారం సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రంతుల్లయ్య, ఏఓ త్రిమూర్తి రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికే కుట్రలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

పులివెందుల టౌన్ : ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే కూటమి నాయకులు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ లక్ష్మణ్ రెడ్డి, విద్యార్థి విభాగపు జిల్లా కోశాధికారి రాఘవేంద్రారెడ్డిలు అన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్ రాజారెడ్డి భవన్ పాత ఎమ్మెల్యే కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక నెలలో పనికిమాలిన శ్వేతపత్రాలతో ప్రజల్ని మభ్య పెట్టారని, అలాగే మరో నెలలో రుషికొండలో కట్టిన ప్రభుత్వ భవనం వివాదం తెచ్చారని, ఇంకోక నెలలో ప్రభుత్వ తప్పిదం వల్లే ఏర్పడిన విజయవాడలో కృష్ణానది వరదలను వైఎస్ఆర్‌సీపీకి సంబంధంలేని బోట్ల వివాదం తెరపైకి తెచ్చారన్నారు. అంతేకాకుండా ప్రజలలో ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు తిరుమల లడ్డూ కల్తీ వివాదం రేపి ప్రజలను మానసికంగా ఇబ్బందులు పెట్టారన్నారు. గతనెలలో షర్మిల ఆస్తుల ఎపిసోడ్‌తో చంద్రబాబు, పచ్చ మీడియా శునకానందం పొందారన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, సొంత పార్టీ మహిళల మీద అఘాయిత్యాలు చేస్తున్నా కేసులు లేవని, ఈ ప్రజా వ్యతిరేక పరిపాలనతో ప్రజలలో కోపం కట్టలు తెంచుకుని రగిలిపోతున్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ



హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు



ఘనంగా విగ్రహ ప్రతిష్ట

తొండూరు : మండల పరిధిలోని ఇనగలూరు గ్రామంలో సోమవారం శ్రీఅంకాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన పూజలు ఘనంగా జరిగాయి. మహిళలు బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వివిధ హోమాలు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని భక్తులు దర్శించుకుని విశేష పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

దోమల నివారణకు సహకరించండి

పులివెందుల రూరల్ : దోమల నివారణకు ఆయిల్స్ బాల్స్ విడుదల చేయడం జరిగిందని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామంలో నీరు నిలిచిన ప్రదేశంలో ఆరోగ్య సిబ్బంది దోమల నివారణ కోసం ఆయిల్స్ బాల్స్ వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు చెత్తాచెదారాలను మురికి కాలువల్లో ఎక్కడ పడితే అక్కడ వేయకుండా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ప్రశాంతి, ఆశా కార్యకర్త సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సింహాద్రిపురం : ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో నీరు నిలబడిన ప్రాంతంలో దోమల నివారణకు ఆరోగ్య సిబ్బంది ఆయిల్ బాల్స్‌ను వదిలారు. కార్యక్రమంలో కోవరంగుంటపల్లె పీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్త గంగాదేవి, ఆశా కార్యకర్తలు శివ కామేశ్వవి, శైలజ, రామాంజనమ్మ, సుదేష్ణ పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



పులివెందుల టౌన్: మిట్టమల్లేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



వేంపల్లె: ప్రత్యేక అలంకరణలో గవిమల్లేశ్వరస్వామి



పూజల్లో పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి



పుష్పగిరిలో ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పొలతలలో స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

పులివెందుల టౌన్ : కార్తీక మాస మొదటి సోమవారం నుండి శైవ క్షేత్రాలలో భక్తులు పరమశివుడికి బిల్వార్చన, రుద్రాభిషేకం, భస్మాభిషేకం, విశేష పూజలు చేశారు. ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి తమ ఇష్టదైవమైన పరమశివున్ని ఆరాధించారు. మహిళలు తెల్లవారుజామున నుంచే ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. పట్టణంలోని మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు రుద్రమూర్తి ఉభయదారులచే శివుడికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం అర్ధనారీశ్వర అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఉమా మహేశ్వరస్వామి ఆలయం, పార్నపల్లె రోడ్డులోని శివాలయం, కడప రోడ్డులోని శివాలయం, మండల పరిధిలోని నామాలగుండు సిద్దలింగేశ్వరస్వామి ఆలయం, పంచలింగాల, గుండాలయ్యకోనలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల నిర్వాహకులు భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి అందరికి దర్శనం కల్పించారు. కార్తీక మాస మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు బసవరాజు విశేష పూజలు నిర్వహించారు. బలిజ సంఘం అధ్యక్షుడు, ఆలయ కమిటీ చైర్మన్ గూడూరు గురు ప్రసాద్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం నిర్వహించి స్వామివారిని వెండి కవచంతో ముగ్ధ మోహన రూపంగా అలంకరించారు.

శివాలయాలో..

వేంపల్లె : కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో శివుడికి పూజలు చేశారు. పాపాఘ్ని నది ఒడ్డున ఉన్న దుర్గా గవి మల్లేశ్వరస్వామి ఆలయం, పాతపేటలోని భవానీ నీలకంఠేశ్వరస్వామి ఆలయాలలో ఆలయ అర్చకులు శంకరమంచి ప్రసాద్ శర్మ, దుర్భాక ప్రసాద్ శర్మలు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : కార్తీక మాసం సందర్భంగా మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం మొదటి సోమవారం అన్ని ఆలయాల్లో ఉదయమే శివుడికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో శివలింగాలను ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక శివాలయంలో పాటు మంగపట్నం, యామవరం, బొందలకుంట, కాన, నల్లబల్లె గ్రామాల్లోని శివాలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు.

పుష్పగిరిలో..

వల్లూరు : కార్తీక మాస మొదటి సోమవారం సందర్భంగా పుష్పగిరిలో భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెన్నా నదిలో స్నానాలు ఆచరించి కొండపై గల శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి, సంతాన మల్లేశ్వర, సాక్షి మల్లేశ్వర స్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు నదితోపాటు ఆలయ ధ్వజ స్థంభం వద్ద , ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించారు. పుష్పగిరి గ్రామంలోని వైద్యనాథస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. కామాక్షీదేవి ఆలయంలో అమ్మవారికి, శ్రీ చక్రానికి కుంకుమార్చనలు చేశారు. త్రికుటేశ్వర స్వామి, ఉమా మహేశ్వర స్వామి , బీమేశ్వర, భీమ లింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలను నిర్వహించారు.

- వల్లూరులోని శ్రీ భవానీ శంకర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలను నిర్వహించారు. పెద్దపుత్త, పెద్ద లేబాక, అంబవరం, పైడికాలువ తదితర గ్రామాలలోని శివాలయాలలో పూజలు నిర్వహించారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : ఉప్పరపల్లి వద్ద ఉన్న శ్రీ నాగ నాగేశ్వరుడు స్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ వారు జిల్లా అధ్యక్షుడిని ఘనంగా సత్కరించారు. అనంతరం చిన్నమాచుపల్లికు చెందిన పుల్లారెడ్డి ఆధ్వర్యంలో చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పొలతలకు తరలివచ్చిన భక్తజనం

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంకు మొదటి కార్తీక సోమవారం భక్తుల సందడి ఎక్కువైంది. భక్తులు జిల్లా నలుమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి గణపతి పూజ, ఆకుపూజ, మహన్యాస రుద్రాభిషేకం, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులి బండెన్న స్వాముల వారికి పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ఈఓ క్రిష్ణానాయక్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మల్లేశ్వరస్వామి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల సంగమేశ్వరాలయం, యు రాజుపాలెం గ్రామంలోని రామలింగేశ్వరాలయం, యస్ పాలగిరిలోని భీమేశ్వరాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలోని టి.చదిపిరాళ్ల, గంగవరం, సంబటూరు, కుంట, కోగటం, మీరాపురం, రామాపురం, పెద్దచ్చెపలి, దాదిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో వెలసిన శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.